## క్లుప్తంగా

### గిట్టుబాటు కూలి కల్పించాలి



నల్లగండ్లలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

హనుమంతునిపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు వారం రోజులు పని చేసిన వారానికి రూ. 334 మాత్రమే కూలీ వచ్చిందని కూలీలు ఆవేదన చెందుతున్నారని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఆయన శుక్రవారం నల్లగండ్ల గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను సందర్శించారు. వారానికి ఎంత కూలీ వస్తుందని కూలీలను అడిగి తెలుసకున్నారు. వారం అంతా పని చేసినా రూ. 334 మించి కూలీ రాలేదని కూలీలు వేశపోగు రాజేష్, కుమారి ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చిన కూలీ డబ్బులకు కూరగాయలు కూడా రావడం లేదు. కూలీలకు ప్రభుత్వం నిర్ణయించిన కూలీ కూడా రావడం లేదు. కూలీలకు రోజువారి గిట్టుబాటు కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు శ్రమకు తగ్గ కూలీ ఇచ్చి పని వద్ద మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరారు.

### ఇంటర్ ప్రవేశాలకు అడ్మిషన్‌లు ప్రారంభం

కందుకూరు: స్థానిక తిక్కవరపు రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు అడ్మిషన్‌లు ప్రారంభమైనట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ఓరుగుంటి వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అడ్మిషన్‌ల కోసం కాలేజీ సంప్రదించవచ్చునని తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం తరగతులు నేటి నుంచి ప్రారంభిస్తామని, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు క్లాసులకు హాజరుకావాలని కోరారు.

### జరుగుమల్లి మండలంలో 6,476 మందికి పింఛను

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలంలో జూన్ నెలకు సంబంధించి 6,476 మందికి నేటి నుంచి పింఛను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ జలజాక్షి తెలిపారు. 4,928 మందికి బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం నగదు జమ చేస్తుందని, మిగిలిన 1,548 మందికి నేరుగా ఇంటి వద్ద పింఛను పంపిణీ చేయనున్నట్లు వివరించారు. లబ్ధిదారుల వివరాలను ఆయా గ్రామ సచివాలయాల్లో ప్రకటిస్తామని, ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ విజ్ఞప్తి చేశారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పీసీపల్లి: విద్యుత్ కార్యాలయంలో మరమ్మతుల సందర్భంగా శనివారం విద్యుత్ నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ లక్ష్మీ ప్రసన్న తెలిపారు. పీసీపల్లిలో 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని మరమ్మతుల సందర్భంగా పీసీపల్లి, బుద్దారెడ్డిపల్లి, గోపవరపు వారిపల్లి, కమ్మవారిపల్లి, మాచర్లవారిపల్లి, కొత్తపల్లి, పతపల్లి, చినవరిమడుగు, పెదవరిమడుగు, మురుగమ్మి ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంట నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు, ప్రజలు గమనించవలసినదిగా ఆమె తెలిపారు.

**నేడు బొట్లగూడూరు విద్యుత్ సరఫరా నిలిపివేత**

పామూరు: మండలంలోని బొట్లగూడూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నేడు శనివారం ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 167బి జాతీయ రహదారిపై విద్యుత్‌లైన్‌ల మరమ్మతులు, నూతన లైన్ ఏర్పాటు దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ జిలాని తెలిపారు. సుమారు వారం రోజుల పాటు నిత్యం 2 నుంచి 3 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ప్రజలు ఇందుకు సహకరించాలన్నారు.

### నేటి నుంచి జయంత్యుత్సవాలు

సింగరాయకొండ: మండల కేంద్రంలోని ఆంజనేయనగర్ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో శనివారం నుంచి 5వ తేదీ వరకు జయంత్యుత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు, 5వ తేదీ బుధవారం మధ్యాహ్నం అన్నసంతర్పణ, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహిస్తామని వివరించారు.

### రేపటి నుంచి మోపాడు గంగా భవాని తిరునాళ్ల



విశిష్ట అలంకరణలో మోపాడు గంగాభవాని మూల విగ్రహమూర్తి

పామూరు: మండలంలోని మోపాడు రిజర్వాయర్ వద్దగల గంగాభవానీ ఆలయంలో శ్రీగంగా భవానీ అమ్మవారి తిరునాళ్ల ఈనెల నెల 2వ తేదీ ఆదివారం నుంచి 6వ తేదీ గురువారం వరకు ఐదు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ తెలిపింది. తిరునాళ్లలో భాగంగా రేపు 2వ తేదీ ఆదివారం నిలుపు, 3, 4వ తేదీలు సోమ, మంగళవారాల్లో అమ్మవారి గ్రామోత్సవం, 5వ తేదీ బుధవారం అమ్మవారి జలదిస్తానం, గావు, రాయభారం, 6వ తేదీ గురువారం బండ్లు పాంగళ్లు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

# కష్టాల ఊబిలో నిమ్మ



మోరవారిపల్లిలో నిమ్మ గ్రేడ్ చేస్తున్న కూలీలు



ఫ్యాక్టరీకి చేరిన నిమ్మ కాయలు

- తగ్గిన నిమ్మ ధరలు
- కోత కూలి కూడా రావడం లేదంటున్న రైతులు

హనుమంతునిపాడు: తగ్గిన నిమ్మ ధరతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది నిమ్మకు ధర ఆది నుంచి ధరలు ఎగుడు దిగుడుగా ఉన్నాయి. ప్రస్తుతం తీవ్ర ఎండలు కాస్తున్నా ధర పెరగ లేదు. కనిగిరి మార్కెట్‌లో కిలో రూ. 25 నుంచి రూ. 30 మించి ధర పలకడం లేదు. హనుమంతునిపాడు మండలానికి జిల్లాలోనే నిమ్మ సాగుకు పేరు ఉంది. అధికారుల లెక్కల ప్రకారం మండలంలో నిమ్మ సాగు 1500 హెక్టార్లలో ఉంటుంది. కానీ లక్షలు పెట్టుబడి పెట్టి పండించిన కాయకు కనీసం గిట్టుబాటు ధరరావడం లేదు. వ్యాపారులు కిలో రూ. 25 నుంచి రూ. 30 మించి ధర రానీయడం లేదని రైతులు చెప్తున్నారు. వ్యాపారులు కొనుగోలు చేసిన కాయను బెంగళూరు, చెన్నై, హైదరాబాదు, ముంబై తరలిస్తారు. అక్కడ మార్కెట్ వ్యాపారులు కొనుగోలు చేయడం లేదనే సాకుతో రూ. 25 మించి ఇవ్వడం లేదని రైతులు చెప్తున్నారు. కోత కూలీలు, ఆటో చార్జీలు కూడా రావడం లేదని కౌలు దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనిగిరి వ్యాపారుల వద్దకు తీసుకొచ్చిన కాయలకు ఆటో చార్జీలు కూడా వెళ్లడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిమ్మ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

# భక్తి శ్రద్ధలతో కోదండరామ స్వామి కల్యాణం



లక్ష్మీనరసాపురంలో విశిష్ట అలంకరణలో సీతా, రామ, లక్ష్మణ విగ్రహాలు



లక్ష్మీనరసాపురంలో కోదండరామస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

పామూరు: మండలంలోని లక్ష్మీనరసాపురం గ్రామంలో శ్రీకోదండరామస్వామి ఆలయంలో సీతా, రాముల దేవతా ఉత్సవ మూర్తుల కల్యాణోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు కొల్లూరి రవికిరణ్‌శర్మ మొదట సీతా, రామ, లక్ష్మ, హనుమంతుని మూల విగ్రహమూర్తులకు పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం సీతా రాముల పంచలోహ విగ్రహమూర్తులను మేళతాళాల నడుమ గర్భాలయం వద్ద నుంచి కల్యాణవేదికకు తరలించి వేద మంత్రాల నడుమ వైభవంగా శాంతి కల్యాణం నిర్వహించి అనంతరం ప్రత్యేక వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయంవద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గాజులపల్లి ధనలక్ష్మి, గాజులపల్లి వెంకటేశ్వరరెడ్డి, పోలు సుధాకర్‌రెడ్డి, దేవస్థాన కమిటీ, భక్తులు పాల్గొన్నారు.

# చల్లగిరిగిలలో కార్డెన్ సెర్చ్



చల్లగిరిగిలలో కార్డెన్ సెర్చ్‌లో సీఐ, ఎస్సైలు

కనిగిరి రూరల్: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ దాసరి వెంకటేశ్వరరావు హెచ్చరించారు. డీఎస్పీ రత్నాకర రామరాజు ఆధ్వర్యంలో మండలంలోని చల్లగిరిగిలలో శుక్రవారం కార్డన్ సెర్చ్ చేశారు. సరైన పత్రాలు లేని 22 మోటార్ సైకిల్ వాహనాలను, ఒక కారు, ఒక ఆటోను గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు. సీఐ డి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. ఎన్నికల కౌంటింగ్ రోజున కానీ, తర్వాత కానీ గ్రామాల్లో ఎలాంటి అలజడులు సృష్టించినా, అసాంఘిక, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడిన, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, ప్రజలను భయ భ్రాంతులకు గురిచేసిన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కనిగిరి, హెచ్‌ఎంపాడు, పీసీపల్లి ఎస్సైలు టి. త్యాగరాజు. శివ నాగరాజు, రమేష్ బాబు, సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున వాట్సాప్, ఇన్‌స్టాగ్రాం గ్రూపుల్లో రెచ్చగొట్టే పోస్టింగ్‌లు పెడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని సీఐ దాసరి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నట్లు వెల్లడించారు. ఎస్సైలు టి. త్యాగరాజు, శివ నాగరాజు, రమేష్ బాబు పాల్గొన్నారు.

### ధనుంజయ్ రెడ్డిని కలిసిన వైఎం ప్రసాద్ రెడ్డి



ధనుంజయ్‌రెడ్డికి పుష్ప గుచ్ఛం అందిస్తున్న పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి (బన్ని)

కనిగిరి రూరల్: స్పెషల్ చీఫ్ సెక్రటరీ టు సీఎం (ఐఏఎస్) కాల్వ ధనుంజయ్ రెడ్డిని పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ధనంజయ్‌రెడ్డి పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో విజయవాడలోని తాడేపల్లి సీఎంఓ కార్యాలయంలో వైఎం ప్రసాద్ రెడ్డి ఆయనను కలిసి పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

### బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు



గాయాలైన వినోద్, నరేంద్ర

పీసీపల్లి: బైక్ అదుపుతప్పి ఇరువురికి గాయాలైన సంఘటన శుక్రవారం జరిగింది. బుద్దారెడ్డిపల్లికి చెందిన గుంటగాని వినోద్, గుంటగాని నరేంద్రలు పెదయిర్లపాడు నుంచి పీసీపల్లికి వస్తుండగా వరిమడుగు వద్ద బైక్ అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు కావడంతో వైద్యం నిమిత్తం ఒంగోలు ఆసుపత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు.

# డిప్యూటీ ఈఓకు అభినందనలు



డిప్యూటీ ఈఓకి అభినందనలు తెలుపుతున్న నాయకులు

కందుకూరు: కందుకూరు డివిజన్ డిప్యూటీ ఈఓగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎంవీవీ ప్రసాద్ రావును శుక్రవారం బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే విద్యాభివృద్ధి కార్యక్రమాలకు బీటీఏ సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని, విద్యాశాఖలో పరిపాలన సక్రమంగా సాగే విధంగా కృషి చేయాలని కోరారు. బీటీఏ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కళ్లగుంట మోహన్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టా రమేష్, కందుకూరు డివిజన్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్లా, నాయకులు కొచ్చెర్ల వెంకటేశ్వర్లు, కొప్పోలు శ్రీనివాసులు, చొప్పర కొండలరావు, వలేటి మాలకొండయ్య, బాపట్ల శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### కూలీల సమస్య పరిష్కరించాలి

పామూరు: ఉపాధి హామీ పథకం కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా అధికారులు కలగజేసుకుని తక్షణం పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు కొమ్మలపాటి మాల్యాద్రి పేర్కొన్నారు. మండలంలోని బొట్లగూడూరు, పాబోలువారిపల్లె, అయ్యవారిపల్లెలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. పనిప్రదేశంలో సరైన వసతులు, ప్రభుత్వ పరంగా అందాల్సిన సాయం సరిగా లేకపోవడంతో ఎక్కువ మంది కూలీలు పనులకు గైర్హాజరవుతున్నారన్నారు. పనిప్రదేశంలో తాగునీటి వసతి లేదన్నారు. కూలీలకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అదేవిధంగా కూలీలకు 200 పనిదినాలు కల్పించడంతో పాటు రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. ఎఫ్ఏలు, మేట్లు, ఉపాధి కూలీలతోపాటు నారాయణ, మాలకొండయ్య, నరేష్, వెంకటేశ్వర్లు, కొండయ్య పలువురు పాల్గొన్నారు.

### వాచ్‌మేన్‌కు ఘన సన్మానం



పాచాహుస్సేన్ దంపతులకు సత్కారం

కందుకూరు: వ్యవసాయ సబ్ డివిజన్ కార్యాలయంలో వాచ్‌మేన్ పనిచేసిన పదవీ విరమణ పొందిన షేక్ పాచాహుస్సేన్‌ను వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఏడీఏ అనసూయ మాట్లాడుతూ దాదాపు 32 సంవత్సరాల పాటు వ్యవసాయశాఖలో పనిచేయడం అభినందనీయమన్నారు. అనంతరం పాచాహుస్సేన్ దంపతులను సన్మానించారు. కావలి ఏడీఏ సీహెచ్ నాగరాజు, కందుకూరు, వీవీపాలెం, ఉలవపాడు, గుడ్లూరు, లింగసముద్రం వ్యవసాయాధికారులు వి. రాము, హేమంత్ భరత్‌కుమార్, బి. తిరుమలజ్యోతి, బి. రవికుమార్, అబ్రహాంలింకన్, టెక్నికల్ వ్యవసాయాధికారి బి. దుర్గాదేవి, ల్యాబ్ అసిస్టెంట్ సుబ్బమ్మ పాల్గొన్నారు.

### ఉపాధి హామీ పనుల్లో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న పీడీ అర్జునరావు

కొండపి(మర్రిపూడి): ఉపాధి హామీ పనుల్లో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ అర్జునరావు హెచ్చరించారు. కొండపి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం టంగుటూరు, సింగరాయకొండ, జరుగుమల్లి మండలాల సిబ్బందితో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూలీలకు పని కల్పించడంతోపాటు రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున పని ప్రదేశంలో నీడ కోసం టెంట్లు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఆయన వెంట ఏపీడీ పాలేటి వెంకటస్వామి, ఎంపీడీఓ నాగమణి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

# నీటి సమస్య లేకుండా చూడండి



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పెన్నా క్రిష్టయ్య

లింగసముద్రం: మండలంలోని గ్రామాల్లో మంచి నీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీపీ పెన్నా క్రిష్టయ్య అన్నారు. శుక్రవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెన్నా క్రిష్టయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నిబంధనలకు లోబడి అభివృద్ధి కార్యక్రామాలపై సమీక్ష నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ రాళ్ళపాడు-రోళ్ళపాడు, చుండి-చెర్లోపాలెం, గుడ్లూరు-రాళ్లపాడు మంచినీటి పథకాల ద్వారా గ్రామాలకు అందిస్తున్న మంచినీటిని అన్ని గ్రామాలకు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అర్‌డబ్లూఎస్ అధికారులకు సూచించారు. ఆర్ఆర్ పాలెం సర్పంచ్ చింతగుంపల అంజమ్మ మాట్లాడుతూ గ్రామంలో మంచినీటి పైప్ లైన్ మరమ్మతులకు గురికావడంతో మంచినీరు వృథాగా పోతుందని అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి పైప్ లైన్‌కి త్వరితగతిన మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. కందుకూరు డిపో నుంచి వలేటివారిపాలెం మీదుగా మాలకొండ్రాయునిపాలెం, వీఆర్ కోట మీదుగా లింగసముద్రం, వీర్ కోట, అన్నెబోయినపల్లె, చినపవని, పెదపవని మీదుగా కావలికి ఆర్టీసీ బస్సు నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌లు వంటేల శ్రీను, దామా సీతారామయ్య సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ కందుకూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌తో మాట్లాడి బస్సు నడిపే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీఓ యు.శేషుబాబు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారుల, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించండి



సింగరాయకొండలో వృద్ధులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

సింగరాయకొండ: మండల ప్రజలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మాగుంట సుబ్బరామిరెడ్డి కాలనీ, గ్రామ పంచాయతీ కార్యాలయం రోడ్డు ప్రాంతాల్లో ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్‌ఆలీ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కలిగించారు. శరీరానికి చెమట పట్టకపోవటం, శరీర ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటం, వణుకు పుట్టడం, మగత నిద్ర కలవరింతలు రావడం లాంటివి వడదెబ్బ లక్షణాలుగా గుర్తించాలన్నారు. వడదెబ్బ లక్షణాలు ఉన్నవారు తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలని సూచించారు. ముఖ్యంగా పిల్లలు, బాలింతలు, గర్భిణులు, వృద్ధులు రోడ్లపై తిరగరాదని చెప్పారు. ప్రజలు తెల్లనిదుస్తులు, తలపాగా ధరించి మాత్రమే రోడ్లపైకి రావాలన్నారు. వడదెబ్బను తట్టుకోవాలంటే ముఖ్యంగా ఉప్పు కలిపిన మజ్జిగ, చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ ద్రావణం, ఓఆర్ఎస్ ద్రావణం తాగాలని సూచించారు. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తికి నీరు తాగించకూడదని వీలైనంత త్వరగా వైద్యుని వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. ఏఎన్ఎం నాగమణి, నసీమున్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముగిసిన సమ్మర్ క్యాంపెయిన్



బహుమతులు అందిస్తున్న జేవీవీ గౌరవాధ్యక్షుడు చెన్నకృష్ణ, వెంకట్రావు

పామూరు: చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వడ్డెపాలెం ఎంపీపీఎస్ పాఠశాలలో నిర్వహించిన సమ్మర్ క్యాంపెయిన్ శిక్షణ కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. బాల, బాలికలకు 5 రోజులపాటు ఆటలు, పాటలు, ఫన్నీ మ్యాక్స్, దేశభక్తి గేయాలు, పొడుపు కథలు, సైన్స్, క్రాఫ్ట్, డ్రాయింగ్ మొదలైన అంశాల్లో శిక్షణ ఇచ్చారు. జేవీవీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ తిరివీధి చెన్నకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మంచి భావాలు, నడవడిక, వ్యక్తిగత ఆరోగ్యం, శుభ్రత వంటివి అలవరుచుకుని మంచి పౌరులుగా ఎదగాలని ఇందుకోసం ఇలాంటి క్యాంపులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. మూఢ విశ్వాసాలు, మత విభేదాలు, దురాచారాలకు దూరంగా ఉండాలని, ప్రశ్నించే తత్వాన్ని అలవరుచుకోవాలన్నారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. జవంగుళ వెంకట్రావు, జేవీవీ నాయకులు అబ్దుల్, కాళే శంకర్, ఐక్య నాయకురాలు షర్మిల, సరళాదేవి, భానుమతి, అంజలి, పలువురు పాల్గొన్నారు.

### తారు రోడ్డుకు మరమ్మతులు చేయాలి



తారు రోడ్డును పరిశీలిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: తారు రోడ్లు గుంతల మయంగా మారడం వల్లనే రాత్రి పూట ప్రమాదాలు జరుతున్నాయని ఆర్‌అండ్‌బీ అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 6,7 వార్డుల పరిధిలో గల తారు రోడ్లు ప్రధాన రహదారులను కౌన్సిలర్లు పాతిరెడ్డి రాజారెడ్డి, తమ్మినేని సుజాతరెడ్డితో కలిసి చైర్మన్ గఫార్ శుక్రవారం డిగ్రీ కాలేజీ వరకు పర్యటించారు. చైర్మన్ గఫార్ మాట్లాడుతూ రహదారులు గుంతల మయంగా ఉండటం వల్ల, సరైన ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఆర్ అండ్‌బీ ఉన్నతాధికారులకు, కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తామని తెలిపారు. ఏఎంసీ డైరెక్టర్ బొట్టు శ్రీను, పాలక శ్రీనివాసులరెడ్డి, యాళ్ల కృష్ణారెడ్డి (చంటి), శ్రీ హరిరెడ్డి, శంకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, విశ్రాంత హెచ్ ఎం ప్రకాష్ రావు పాల్గొన్నారు.

### విద్యార్థులకు పోషకాహారాన్ని అందించాలి



టంగుటూరులో వంటలను పరిశీలిస్తున్న అధికారులు

టంగుటూరు: విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని రుచిగా, శుచిగా అందించాలని ఎంఈఓ-2 తన్నీరు బాలాజీ సూచించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శుక్రవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. పోషకాహారంలో సాంకేతిక అంశాలపై మాస్టర్ ట్రైనర్లు సంతనూతలపాడు ఎంఈఓ వెంకారెడ్డి, జిల్లా ఎండీఎం కోఆర్డినేటర్ విశ్వేశ్వర శర్మ అవగాహన కల్పించారు. అనంతరం కుక్ కం హెల్పర్స్ తయారు చేసిన వివిధ ఆహార పదార్థాలను ప్రదర్శించి వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ చెంచుపున్నయ్య, కుకింగ్ రిసోర్స్ పర్సన్లు రేవతి, సుమని, సీఆర్పీలు జోషి, సుబ్బులు, శ్రీహరి, సిబ్బంది వేణు, బాలకృష్ణ పాల్గొన్నారు.

### పొగాకు అత్యధిక ధర రూ.335



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో శుక్రువారం నిర్వహించిన వేలంలో పొగాకు అత్యధిక ధర రూ.335 పలికింది. కట్టుబడిపాలెం గ్రామానికి చెందిన రైతులు 644 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 566 కొనుగోలయ్యాయి. కనిష్ఠ ధర రూ.205, సరాసరి ధర రూ.278.82 పలికింది. వేలంలో మొత్తం 41 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

### రెచ్చగొట్టే పోస్టులు పెట్టవద్దు



సోషల్ మీడియా కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎస్సై బాజిరెడ్డి

ఉలవపాడు: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఏ రాజకీయపార్టీకి చెందినవారు కూడా రెచ్చగొట్టే పోస్టులు పెట్టవద్దని ఎస్సై బాజిరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివిధ పార్టీలకు చెందిన సోషల్ మీడియా కార్యకర్తలతో మాట్లాడారు. ఎవరినీ కించపరిచే విధంగా గానీ, వివాదాస్పదంగా ఉండే పోస్టులను కానీ పెట్టి సోషల్ మీడియాల్లో ప్రేరేపించవద్దని తెలిపారు. శాంతి భద్రతలు అదుపులో ఉండడానికి సహకరించాలని కోరారు. ఎన్నికల కోడ్ జూన్ 6 వరకు అమలులో ఉంటుందన్నారు. ఎన్నికల ఉత్సవాలు నిర్వహించడం, డీజేలు పెట్టడం, బాణసంచా కాల్చడం నిషేధమన్నారు.

### హనుమత్ జయంతి వేడుకలకు ముస్తాబైన ఆలయాలు



సీఎస్‌పురంలో హనుమత్ జయంతికి ముస్తాబైన ఆలయం

సీఎస్‌పురం (పామూరు): వైశాఖ మాసం బహుళ దశమిన వచ్చే హనుమజ్జయంతి వేడుకలకు మండలంలోని హనుమంతుని ఆలయాలు ముస్తాబయ్యాయి. మండల కేంద్రమైన సీఎస్‌పురంతోపాటు మండలంలోని సి.నాగులవరం, కంభంపాడుతో పాటు పలు ఆలయాలు వేడుకలకు ముస్తాబయ్యాయి.